## క్లుప్తంగా

### సచివాలయానికి తరలిన మహిళలు



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ వాణి

**తుక్కుగూడ:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఇందుకుగాను అధికారులు బస్సులు ఏర్పాటు చేయగా.. కమిషనర్ ఏ.వాణి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు



టోర్నీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**తుక్కుగూడ:** సీఎం కప్–2024 క్రీడా పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళ, బుధవారాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పీడీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే టోర్నీలో కళాశాల, పాఠశాల విద్యార్థులు తలబడి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులతో పాటు, జిల్లా స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్వాములు

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరులో అయ్యప్ప మహాపడి పూజను 18వ మెట్టు గురుస్వామి ఎగిరిశెట్టి యాదయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు ముకుంద, వట్టిపల్లి రామశర్మ సమక్షంలో అయ్యప్పకు అభిషేకం, పడిపూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణలతో గ్రామం మార్మోగింది. కాగా 18వ సారి మాలధారణ చేసిన యాదయ్యను సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కాసుల రామకృష్ణారెడ్డి, సాధ మల్లారెడ్డి, గురుస్వాములు కళ్లెం జంగారెడ్డి, రమేశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్, దేవరకొండ గణేశ్, రాములుగౌడ్, మల్లేశ్‌యాదవ్, బాణాల శేఖర్, ఎస్.దామోదర్, ఎం.మల్లేశ్, బి.యాదయ్య, పి.జైపాల్ రెడ్డి, కిషోర్, ప్రవీణ్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు మానుకోవాలి

**హుడాకాంప్లెక్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని వైభవంగా సంబరాలు జరుపుకొంటుంటే బీఆర్ఎస్ నేతల విమర్శలు చేయడం సరికాదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం తగదని, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రతినిధులు ప్రభుత్వంపై దుష్ప్రచారం మానుకుని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

### లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోండి

**కడ్తాల్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో లయన్ సహకారంతో ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం.. నిరుపేదలు, ప్రయాణికుల ఆకలిని తీరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్న కిషన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, రమేశ్, వెంకటేశ్, శ్రీను, బీచ్యానాయక్, కుమార్‌గౌడ్, రాజేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

# ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

**ఒక్కో ఆటోలో 20 నుంచి 30 మంది**
- ఆటోవాలాల ఇష్టారాజ్యం.. వ్యవసాయ కూలీలకు ప్రాణసంకటం

**యాచారం:** పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. స్థానికంగా ఎవరూ పత్తి తీతకు ముందుకు రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రవాణా ఖర్చును భరించి, అధిక కూలీ ధరలు వెచ్చించి ఆటోల్లో కూలీలను పొలాలకు తరలిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ట్రాలీ, ప్యాసింజర్ ఆటో తదితర వాహనాల్లో స్థాయికి మించి మహిళలను తీసుకెళ్తుండటం ఆందోళన కలిగిస్తోంది. డ్రైవర్ ఏ మాత్రం ఏమరు పాటున ఉన్నా, ముందు, వెనకాల వచ్చే వాహన చోదకులు నిర్లక్ష్య డ్రైవింగ్ చేసినా పదుల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

**అధికారుల నిర్లక్ష్యం.. కూలీలకు శాపం**

ఇష్టానుసారంగా వాహనాల్లో వ్యవసాయ కూలీలను తరలిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు, రోడ్డు రవాణా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి, అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. కూలీలు, వారిని తరలిస్తున్న వారు సైతం భద్రత గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. మాడ్గుల, కడ్తాల్, ఆమనగల్లు మండలాలతో పాటు, నల్లగొండ జిల్లా పరిధి మర్రిగూడ, చింతపల్లి, దేవరకొండ మండలాల్లో రైతులు పత్తి పంటను అత్యధికంగా సాగు చేశారు. ఆయా ప్రాంతాల్లో కూలీల కొరత ఉండటంతో.. యాచారం మండల నుంచి యాచారం, నందివనపర్తి, చౌదర్‌పల్లి, నల్లవెల్లి, చింతపట్ల, కిషన్‌పల్లి, మాల్, కొత్తపల్లి, నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పత్తితీత పనులకు వెళ్తుంటారు.



సాగర్‌రోడ్డు మాల్ కేంద్రం నుంచి పత్తి తీతకు ఆటోలో వెళ్తున్న మహిళా కూలీలు

**సాగర్‌రోడ్డుపై పరుగు**

పత్తి తీతకు మహిళా కూలీలు ఆటోల్లో సాగర్ రహదారిపై పయనిస్తుంటారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపు సుమారు 50 నుంచి వంద ఆటోల్లో కూలీలను తరలిస్తుంటారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, లైసెన్స్, అనుభవం లేని డ్రైవర్లు ఒక్కో ఆటోలో 20 నుంచి 30 మందిని వ్యవసాయ పనులకు తరలిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన ప్యాసింజర్స్‌తో ఆటోవాలాలు దూసుకుపోతుంటారు. వాటితో పాటు ఇతర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉన్న హైవేలో ఇలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఆటో, తదితర వాహనాలను పోలీసు, ఆర్టీఏ అధికారులు కట్టడి చేయలేకపోతున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.

**కూలీ డబ్బుల ఆశతో..**

కూలీ డబ్బుల ఆశతో మహిళా కూలీలు ఇలా ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. నిత్యం రూ.500లతో పాటు ప్రయాణ ఖర్చులు, దావత్‌కు రైతులు డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో అన్నదాతలు పంట నష్టభయంతో అధిక రేట్లు చెల్లించి కూలీలను రప్పించుకుంటున్నారు. అయితే పత్తితీత పనుల్లో గిట్టుబాటు అవుతుందనే ఆశతో.. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అరకొర వాహనాల్లో కూలీలు కిక్కిరిసి ప్రయాణించడం.. ఆందోళనకలిగిస్తోంది. ఏ మాత్రం పట్టుతప్పినా, చోదకుడు ఏమరు పాటున ఉన్నా అందరి ప్రాణాలకు ముప్పుతప్పదని జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

**నిఘా ఏర్పాటు చేస్తాం**



ఆటోల్లో పరిమితికి మంచి మహిళా కూలీలను తరలిస్తున్న డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. కూలీలు కూడా జాగ్రత్తగా ప్రయాణం చేయాలి. మాల్ ప్రధాన కూడలిలో ఉదయం, సాయంత్రం వేళల్లో నిఘా ఏర్పాటు చేస్తాం. డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతాం. ప్రమాదాలు జరిగితే ఆటో డ్రైవర్లదే బాధ్యత. నింబంధనలు ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేస్తాం. డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తాం.

– నర్సింహారావు, సీఐ, యాచారం

# కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**సీఐటీయూ కన్వీనర్ బాల్‌రాజ్**

**కందుకూరు:** సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆశవర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న ఆరోగ్య శాఖ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆశవర్కర్లతో కలిసి మండల పరిధిలోని కందుకూరు, రాచులూరు, లేమూరు పీహెచ్‌సీల్లోని వైద్యాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఆశవర్కర్లతో వెట్టిచాకిరీ చేయించిందన్నారు. అప్పట్లో ఉద్యమాలు చేసినా ఫలితం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సుశీల, సంధ్య, విజయ, రాధిక, జయసుధ, శ్రీలత, ముంతాజ్‌బేగం, అప్రోచ్, లక్ష్మీదేవి, పోచమ్మ, భాగ్యలక్ష్మి, అశ్విని, అండాలు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



రాచులూరు పీహెచ్‌సీలో వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు, నాయకులు

# రోడ్డును ఆక్రమిస్తే వెళ్లేదెలా?

**మీర్‌పేట:** అసలే కాలనీలో ఇరుకు రోడ్లు.. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే ఒకరు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి ఈ మార్గంలో ఓ ఇంటి యజమాని సగం రోడ్డును ఆక్రమించడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్ ఫేజ్–2 రోడ్ నెం–4లో ఇంటి ముందు పైపులైన్ కోసం గుంతను తవ్వారు. దీంతో సదరు యజమాని రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ.. ఉన్న కాస్త రహదారిని సగం వరకు కర్రలు, పూలకుండీలు పెట్టి మూసివేశారు. దీంతో వారం రోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు, స్కూల్ బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోజు ఇబ్బందిగా ఉన్నా ఇంటి యజమాని స్పందించడం లేదని, కార్పొరేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రోడ్డును ఆక్రమించి కర్రలు, పూలకుండీలు ఏర్పాటు చేసిన యజమాని

# కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

- అర్హులందరికీ ఇళ్లు అందించేందుకు కృషి
- పార్టీ నాయకులు



నేదునూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న నాయకులు

**కందుకూరు:** అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నేదునూరులో పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. వారి వెంట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర సురేశ్, నాయకులు వరికుప్పల బాబు, సంజీవరెడ్డి, భాస్కర్, ఎండీ సద్దాం, వంగూరి నర్సింహ, కారోబార్ మహేందర్, ఎండీ రఫీక్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి మహా సమ్మేళనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

**బ్రాహ్మణ సంఘం నాయకులు**

**హుడాకాంప్లెక్స్:** బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, ప్రగతి కోసమే నిర్వహించనున్న బ్రాహ్మణ మహా సమ్మేళనానికి యావత్ బ్రాహ్మణులను ఆహ్వానిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు బీఆర్‌వీ. సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన అబిడ్స్‌లోని రాఘవరత్న టవర్స్‌లోని మైనింగ్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం, 29వ తేదీన రవీంద్రభారతిలో జరగబోయే మహా సమ్మేళనం పోస్టర్లను సోమవారం కొత్తపేటలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. సమ్మేళనాలకు బ్రాహ్మణులందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దూప దీప నైవేద్య పథకం సంఘం అధ్యక్షులు వాసుదేవశర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు పోచంపల్లి రమణారావు, కోశాధికారి విద్యావతి, ఆహ్వాన కమిటీ కన్వీనర్ రాంచందర్‌రావు, విష్ణుదాస్, శ్రీకాంత్, డా.ప్రియదర్శిని, వేదాంతం పవన్‌కుమార్, పెండ్యాల వైద్యనాథ్ పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో మెరుగైన వసతులు

**చైర్ పర్సన్ యాట గీత**

**ఆమనగల్లు:** వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మెరుగైన వసతులు కల్పిస్తామని చైర్ పర్సన్ యాట గీత అన్నారు. సోమవారం ఆమె యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలించారు. రైతులను సమస్యలు అడగగా.. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయని, తడిసిన గింజలను కొనుగోలు చేయాలని ఆమెను కోరారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని వెల్లడించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు సాయి, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

## విద్యార్థులకు గణితం పరీక్ష

**ఆమనగల్లు:** మండల స్థాయి గణితం పోటీ పరీక్షలను సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కాంపిటేషన్‌కు మండల పరిధి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఆంగ్ల మాధ్యమంలో శ్రీవల్లి, దేవదాసు, నందిని, తెలుగు విభాగంలో పూజ, రోజ, నీలావతిలు విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దూసకంటి శ్రీదర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావ్వ స్వామి, అశోక్‌రెడ్డి, నాగసుందరీ, కనకదుర్గ, సుజాత, వెంకట్‌నారాయణ తదితరులు ఉన్నారు.

**జిల్లా స్థాయికి**

**కడ్తాల్:** మండల స్థాయి గణితం పోటీ పరీక్షలను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కాంపిటేషన్‌కు మండల పరిధి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎంలు జంగయ్య, అరుణ, ఉపాధ్యాయ బృందం ప్రశ్నపత్రాలను విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. పరీక్ష అనంతరం ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో ఆంగ్లం, తెలుగు మాధ్యమం నుంచి ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం చిన్నారులను అభినందించారు.

# తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ



మహేశ్వరం: కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



తుక్కుగూడలో.. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులు

- దశాబ్దాల కల నెరవేర్చిన మహనీయురాలు: కాంగ్రెస్ శ్రేణులు
- ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

**మహేశ్వరం:** తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీకే దక్కిందని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలోని పార్టీ మహేశ్వరం అధ్యక్షుడు బంగారిగళ్ల లాజర్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కల సాకారం చేసిన సోనియాకు రాష్ట్ర రుణపడి ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన విజయవంతంగా కొనసాగుతుందన్నారు. సీనియర్ నాయకులు యాదయ్య, రాజునాయక్, యాదయ్య, అంధ్యా నాయక్, నర్సింహ, కుమార్, రఘుపతి, పాండు నాయక్, రామ్‌నాయక్, బాల్‌రాజ్, ప్రవీణ్, నర్సింహ, సేవ్యా నాయక్, రవి నాయక్, శివ, సుభాష్, పాండు ముదిరాజ్, నర్సింహగౌడ్, జంగయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేటలో.. మేయర్ పారిజాత తదితరులు

**తుక్కుగూడలో..**

**తుక్కుగూడ:** రాష్ట్ర ప్రజలకు సాకారం చేసిన మహానాయకురాలు సోనియాగాంధీ అని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కందుకూరులో..

**కందుకూరులో..**

**కందుకూరు:** కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకొని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత బస్ పాసుల పంపిణీ

**యాచారం:** దివ్యాంగులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాసులు అందజేశారు. మండల పరిధి గునుగల్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనువాస్‌రెడ్డి తన సొంత నిధులతో 80 మందికి పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. వారి సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని పేర్కొన్నారు. నాయకులు యాదయ్య, మచ్చ లక్ష్మణ్, పూజారి రాకేష్‌కుమార్, మహేశ్, సుధాకర్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయాలు దేశాభివృద్ధికి సోపానాలు

**తలకొండపల్లి:** విద్యాలయాలు దేశాభివృద్ధికి సోపానాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉంటుందని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.3 లక్షలు విలువ చేసే 70 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా బాలచంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ అభ్యసించాలని సూచించారు. మాణిక్యరెడ్డి, హరికిషన్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ శ్రీనివాస గుప్తా, హెచ్‌ఎం వెంకటయ్య, సంస్థ సభ్యులు అమృత్, శరత్‌చంద్ర, మాజీ సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, ఏపీసీ చైర్‌పర్సన్ ప్రేమలత, రమాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టాలు సరే.. ప్లాట్లు ఏవి?

- లబ్ధిదారులకు నివాస స్థలాలు చూపాలి: బీజేపీ
- జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేత

**తలకొండపల్లి:** ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేసిన వారికి.. వెంటనే స్థలాలు చూపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు ప్రసాద్ డిమాండ్ చేశారు. దఫాలుగా పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1998, 99, 2000 సంవత్సరంలో ప్లాట్ల పట్టాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని 6,7 సర్వే నంబర్లలో 1981 నుంచి 2021 వరకు 7 సార్లు, 2023లో మరోసారి పంపిణీ చేశారని తెలిపారు. పత్రాలు అయితే ఇస్తున్నారని కానీ.. లబ్ధిదారులకు నివాస స్థలాలు చూపించడం లేదని వెల్లడించారు. ఇదే విషయమై గతంలో అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వారి గురించి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లబ్ధిదారులకు పక్షం రోజుల్లో స్థలాలు చూపించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనల కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవి గౌడ్, మాజీ సర్పంచ్ కుమార్, రాష్ట్ర నాయకులు పాండు, అసెంబ్లీ కన్వీనర్ అనిల్, యాదయ్య, హరికాంత్, కుమార్, శ్రీను, మహేశ్, శ్రీశైలం, శాంతకుమారి పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

# పాఠశాల విద్యతోనే భవిష్యత్తు



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న సీఐ కృష్ణంరాజు తదితరులు

**యాచారం:** పాఠశాల విద్య ఎంతో విలువైనదని, ఉన్నత లక్ష్యంతో చదివితే భవిష్యత్తుకు ఢోకా ఉండదని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. సోమవారం నక్కర్తమేడిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. దాతల సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, బాగా చదువుకోవాలని బాలబాలికలకు చెప్పారు. పాఠశాల విద్యతోనే ఉన్నత చదువుల్లో ఇబ్బంది ఉండదని స్పష్టంచేశారు.